
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

కరీంనగర్
5 జిల్లా వార్తలు
బుధవారం 19 నవంబరు 2025

6 మాయమవుతున్న మానవత్వం
● చిన్నచిన్న కారణాలతో కుటుంబసభ్యుల హత్యలు
● కాలయములుగా మారుతున్న కన్నవారు

6 పీజీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల
● 95 శాతం ఉత్తీర్ణత

మహిళా పోలీసులకు మానసిక దృఢత్వ శిక్షణ

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసులకు శారీరక ధృడత్వంతోపాటు మానసిక ధృడత్వం కూడా అవసరమని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. సైకాల జిస్ట్ అడ్డిగ శ్రీనివాస్‌తో మహిళా కాని స్టేబుళ్లకు మానసిక ఒత్తిడిని జయించే అంశాలపై మంగళవారం ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే కఠినమైన విధుల్లో ఒత్తిడిని అధిగమించేందుకు ఈ శిక్షణను ఉప యోగించుకోవాలన్నారు. అనంతరం అ డ్డిగ శ్రీని వాస్ మాట్లాడుతూ ఏదైనా ఒక విషయంపై అవసరానికి మించి ఆలోచిం చవద్దన్నారు. మన చేతుల్లో లేని అంశాల గురించి ఆందో ళన చెందడం, జరిగి పోయిన విషయాన్ని పదే పదే తలచు కోవడం వంటి కారణాల వల్ల మానసిక ఒత్తిడికి గురవుతామని తెలిపారు. చే స్తున్న పనిపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా మానసిక ఒత్తిడిని సమర్థ వంతంగా జయించవచ్చని శ్రీనివాస్ వివరించారు.

పంచాయతీలపై బీజేపీ దృష్టి

● నేడు హుజూరాబాద్‌లో సమావేశం
● హాజరు కానున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పంచాయతీ ఎన్నికలపై భారతీయ జనతా పార్టీ దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను డిసెంబరులో నిర్వహించాలని కేనెట్ సమావేశంలో నిర్ణయించడంతో ఆ దిశగా బీజేపీ పావులు కదుపుతున్నది. దీనిలో భాగంగా బుధవారం హుజూరాబాద్‌లో పోలింగ్‌బూత్ అధ్యక్షులు, సోషల్ మీడియా వారియర్స్ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ హాజరై బీజేపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారు. బీజేపీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని సమావేశాలు ఏర్పాటు చేస్తున్నది. కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలో అత్యధిక సర్పంచ్ వార్డు సభ్యుల స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నది.

● ఇప్పటికే అభ్యర్థుల ఎంపికపై సర్వేలు

ఇప్పటికే గ్రామాల వారీగా సర్పంచ్ అభ్యర్థుల ఎంపికలపై సర్వేలు నిర్వహించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పంచాయతీ ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగానే హుజూరాబాద్ పట్టణంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని పోలింగ్ బూత్ అధ్యక్షులు, కార్యదర్శులు సోషల్ మీడియా వారియర్స్‌తో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటుచే శారు. గతంలోనే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోరెండు సార్లు సమావేశాలు నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో హుజూరాబాద్‌లో నిర్వహించే సమావేశానికి ప్రాధాన్యం చేకూరింది. బీజేపీలో ప్రధానంగా రెండు అంశాలపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించనున్నారు. పార్టీ క్యాడర్‌ను పంచాయతీ ఎన్నికలకు సిద్ధం చేస్తూనే మరో వైపు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టే విధంగా సమావేశంలో యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించనున్నారు. రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. కాంగ్రెస్ రెండేళ్ల (మిగతా 8వ పేజీలో)

సీసీఐ ద్వారానే పత్తి కొనాలి

● కౌలు రైతులు నేరుగా అమ్ముకునే అవకాశం కల్పించాలి
● ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కలెక్టరేట్ ఎదుట పత్తి బస్తాలతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన మొత్తం పత్తిని కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. పత్తి కొనుగోళ్లకు సంబంధించి సీసీఐ జారీ చేసిన కొత్త నిభందనలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత వల్ల రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు ఢిల్లీకి వెళ్ళి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. జిన్నింగ్ మిల్లులకు ఎల్-1, ఎల్-2, ఎల్-3 అని సీసీఐ కెటాయించిందని తెలిపారు. ఈ నిభందన వల్ల రైతులు ఐదు రోజుల వరకు జిన్నింగ్ మిల్లుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. ఈ నిభందనను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పట్టాదారు వచ్చి వేలి ముద్ర వేస్తేనే పత్తి కొనుగోలు చేస్తామని సీసీఐ నిబంధన విదించిందని, కౌలు రైతులు పండించిన పత్తి ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నించారు. ఎకరానికి సుమారు 15 క్వింటాళ్ళ పత్తి పండుతుందని, అందులో 12 క్వింటాళ్ల పత్తిని అమ్ముకునే అవకాశం ఉండేదని, సీసీఐ ఎకరానికి ఏడు క్వింటాళ్లే కొనాలని పరిమితి విధించిందన్నారు. మిగిలిన పత్తి దళారులకు అమ్మడం ద్వారా పత్తి రైతు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇంతవరకు పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి జిన్నింగ్ మిల్లుల సమ్మెను విరమింప చేయాలని, పత్తి కొనుగోళ్లు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఐలేందర్ యాదవ్, మిర్జా అస్మత్‌అలీబేగ్, గందె మాధవి పాల్గొన్నారు.

నిరంతరం తనిఖీలు చేపట్టాలి

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల మూలాలను కూకటివేళ్లతో పెకిలించివేయాలని, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్, ఎక్సైజ్, వైద్య ఆరోగ్య, శిశు సంక్షేమ, విద్య తదితర శాఖల అధికారులతో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాతుతూ.. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణా మాలపై బహిరంగ ప్రదే శాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో విస్తృత తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యులు రాసిన చీటీ లేకుండా మత్తు మందులను, ఇంజక్షన్లను మెడికల్ షాపుల్లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. మత్తు పదార్థాల నిర్మూలనకు నిత్యం గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాలు వినియోగం, సరఫరా వంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

● బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బాల్య వివాహాన్ని ఆపిన జమ్మికుంట మండలం పాపక్కపల్లి పంచాయతీ కార్యదర్శి నరేందర్‌రెడ్డిని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మలను కలెక్టర్ పమేలా సత్పతి తర చాంబర్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం ఉంటే 1098 హెల్ప్‌లైన్‌కు తెలియజేయాలని సూచించారు.

పొగమంచులో డ్రైవింగ్ చేసే వారు జాగ్రత్తగా ఉండాలి

● సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత శీతాకాలంలో రాత్రిపూట, తెల్లవారుజామున ఏర్పడే దట్టమైన పొగమంచు వల్ల విజిబిలిటీ తక్కువగా ఉంటుందని, ఇది రోడ్డు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని సీపీ గౌస్‌ఆలం ఓ ప్రకటనలో తెలిపారు. వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు పాటించాల్సిన ముఖ్యమైన భద్రతా చర్యలను సీపీ సూచించారు. హై బీమ్ లైట్లు పొగమంచు నుంచి వెనక్కి ప్రతిబింబించి విజిబిలిటీ మరింత తగ్గిస్తాయన్నారు. పొగమంచు ఉన్నప్పుడు లో బీమ్‌పై డ్రైవ్ చేయాలని సీపీ సూచించారు. అత్యవసర బ్రేకింగ్‌కు వీలు కల్పించడానికి ముందు వాహనం నుంచి సాధారణ దూరం కంటే రెండింతలు ఎక్కువ దూరం ఉండాలన్నారు. పొగమంచులో నెమ్మదిగా డ్రైవింగ్ చేయాలని, నియంత్రిత వేగాన్ని పాటించి, ఆకస్మిక అడ్డంకులకు సిద్ధంగా ఉండాలన్నారు. విజిబిలిటీ తక్కువగా ఉన్నప్పుడు మాత్రమే ఫాగ్ ల్యాంప్‌లను ఆన్ చేయాలన్నారు. వాహనం నిలిపివేసినప్పుడు మాత్రమే పార్కింగ్ లైట్లను ఉపయోగించాలని సూచించారు. ఒకే లైన్‌లోనే డ్రైవ్ చేయాలని, రోడ్డు గుర్తులు, రిఫ్లెక్టర్లను గమనిస్తూ వాటి ద్వారా ముందుకు సాగాలన్నారు. పరిస్థితుల అవగాహనను మెరుగు పరచడానికి విండోను కొద్దిగా తెరవాలన్నా రు. తేమ పేరుకుపోకుండా ఉండటానికి క్రమం తప్పకుండా విండ్‌షీల్డ్‌ను క్లియర్ చేయడానికి వైపర్లు, డీఫాగర్లను ఉపయోగించాలని సూచించారు.

పొగమంచు కారణంగా నెమ్మదిగా వెళ్లాల్సి వస్తుందని, తొందర పడకుండా ఉండడానికి ప్రయాణాన్ని కొంచెం ముందుగానే ప్రారంభించాలన్నారు. విజిబిలిటీ జీరోకి దగ్గరగా ఉంటే, అది తొలగిపోయే వరకు వాహనాన్ని ఆపి, పార్కింగ్ లైట్లు వేసి రోడ్డు పక్కన సురక్షితంగా పార్క్ చేయాలని సీపీ సూచించారు. ప్రయాణీకులందరూ సీటు బెల్టులు ధరించాలన్నారు. రోడ్డుపై, బ్లైండ్ కర్వ్‌ల వద్ద వాహనాలను ఆపవద్దని తెలిపారు. పొగమంచు ఉన్న పరిస్థితుల్లో ఓవర్‌టేక్ చేయవద్దన్నారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు నావిగేషన్ కోసం కూడా మొబైల్ ఫోన్‌ను ఉపయోగించవద్దన్నారు. అప్రమత్తంగా ఉండి జాగ్రత్తగా వాహనాలను డ్రైవ్ చేస్తే సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవచ్చని సీపీ తెలిపారు.

వక్ఫ్ ఆస్తుల వివరాలు అప్‌లోడ్ చేయాలి

● రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని



మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేని

కరీంనగర్ అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన ఆస్తుల వివరాలను డిసెంబరు 6లోగా ఉమిద్ సెంట్రల్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని అన్నారు. జిల్లా వక్ఫ్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా మసీదు, కబ్రస్తాన్, ఈద్గా, దర్గా, మదర్సా కమిటీల సభ్యులకు కరీంనగర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని మాట్లాడుతూ... వక్ఫ్ బోర్డుకు చెందిన చాలా ఆస్తుల వివరాలను ఇంకా అప్‌లోడ్ చేయ లేదని, వాటన్నిటిని త్వరగా అప్‌లోడ్ చేయాలన్నారు. ఆస్తుల వివరాలను ఈ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తేనే వక్ఫ్‌బోర్డుకు ఐదు శాతం ఆదాయం వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉమిద్ సెంట్రల్ పోర్టల్ వక్ఫ్ ప్రాపర్టీస్ సవరణపై అవగాహన కల్పించారు. సదస్సుకు జిల్లా వక్ఫ్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్ కమిటీ చైర్మన్ అబ్దుల్ సమద్ నవాబ్, కమిటీ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ తాజోద్దీన్, లయీక్ ఖాద్రీ, నెహల్ అహ్మద్, అబ్దుల్ రహమాన్, కమరోద్దీన్, మోసిన్, ఇర్ఫాన్, చాంద్, అజీం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్య, వైద్యానికి ప్రాధాన్యం

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి
● ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులలో కలిసి భోజనం, రాత్రి బస



రాంనగర్ ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్య, వైద్యానికి మొదటి ప్రాధానమిస్తున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ రాంనగర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహంలో నరేందర్‌రెడ్డి మంగళవారం రాత్రి విద్యార్థులతో కలిసి బోజనం చేసి రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచిందన్నారు. చలి తీవ్రత దృష్ట్యా విద్యార్థులందరికి బ్లాంకెట్లు అందజేశామన్నారు. 600 నోట్‌బుక్‌లు, క్రికెట్ కిట్లు పంపిణీ చేశామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి అక్కడే బస చేశారు. కార్యక్రమంలో కొరివి అరుణకుమార్, మేకల నర్సయ్య, గుండటి శ్రీనివాస్‌రెడ్డి, గంధం శ్రీనివాస్‌గౌడ్, పెద్దిగారి తిరుపతి, వంగ హరీష్‌గౌడ్, మునిగంటి అనిల్, కొట్టే ప్రభాకర్, కాంపెల్లి కీర్తి కుమార్, సిద్ది లక్ష్మణ్, వార్డెన్ అంజయ్య పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక 'మాస శివరాత్రి'

కరీంనగర్ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):కార్తీక మాసంలో వచ్చే మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం నగరంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం, సాయంత్రం భక్తులు ఆలయాల్లో, ఇళ్లలో దీపారాధనలు చేశారు. కార్తీక దీప దానాలను, దాన ధర్మాదులను ఆచరించారు. పుణ్య క్షేత్రాలు సందర్శించి నదీ స్నానాలు ఆచరించారు. ఆకాశ దీపాలను పూజించారు. శివయ్య అభిషేక అర్చనల్లో పాల్గొని తరించారు. పాతబజార్ గౌరీశంకరాలయంలో పురాణం మహేశ్వరశర్మ, పురాణం శ్రీనివాసశర్మ బృందం నేతృత్వంలో గోపూజ, గురువందనం, ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, హరిహరుల కల్యాణం, రథోత్సవం, ఊంజల్‌సేవ కన్నులపండువలా నిర్వహించారు. అనంతరం అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ప్రొద్దుటూరి శ్రీనివాస్, ఈవో వుడుతల వెంకన్న, భక్తులు పాల్గొన్నారు.



పాతబజార్ గౌరీశంకరాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

జాబ్ కార్డుల కోసం ఎదురుచూపులు

● ఇందిరమ్మ ఇళ్లకు ఉపాధి పనుల అనుసంధానం

కరీంనగర్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామి జాబ్ కార్డులు మంజూరు కాకపోవడంతో గ్రామాల్లోని అర్హులు నిరాశకు గురవుతున్నారు. మరో రెండు నెలలకు వ్యవసాయ పనులు ముగుస్తాయి. వేరే పనులు దొరకవు. ఈ సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు ఉపాధిహామి పనుల వైపు చూస్తారు. ఉపాధి పనులకు వెళ్లాలి అనుకునే వారికి కొత్తగా జాబ్ కార్డులు ఇవ్వడం లేదు. లేదు. కరీంనగర్ రూరల్ మండలంలో 14 గ్రామ పంచాయతీల్లో 7,280 మంది కూలీలు ఉం డగా 4,572 మందికే జాబ్‌కార్డులు ఉన్నా యి. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులకు ఉపాధి హామి పథ కాన్ని అనుసంధానం చేసింది. జాబ్‌కార్డులు ఉన్న వారికి కనీసం 90 రోజుల పాటు పని దినాలను కల్పిస్తారు. రోజుకు 307 రూపాయల చొప్పున 27,630 రూపాయలు వారి ఖాతాల్లో జమ చేస్తారు. ఇది వారికి ఆర్థికంగా కొంత వెసులు బాటుగా ఉంటుంది. నూత నంగా జాబ్ కార్డు మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాది కారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. అధి కారులు జాబ్ కార్డు లేని వారు వివరాలు సేకరిస్తు న్నారు కాని కార్డులు ఇవ్వడం లేదు. నూతన జాబ్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అర్హులు కోరుతున్నారు.



నగునూర్ చెరవులోపూడిక తీత పనులు చేపడుతున్న ఉపాధి కూలీలు (ఫైల్)

పంచాయతీ పైపులు మాయం

- పోలీసులకు ఫిర్యాదు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు18(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామ పంచాయతీకి సంబంధించిన తాగు నీటి పైపులు మాయమయ్యాయి. సుమారు 30 పైపులు కనిపించకుండాపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంగళవారం ఆరా తీశారు. మండలంలోని గర్జనపల్లికి చెందిన రైతు బంతిలాల్ వ్యవసాయ పొలంలో పైపులు వేస్తుండడాన్ని గమనించారు. ఎక్కడి నుంచి తీసుకువచ్చారని ప్రశ్నించారు. సదరు రైతు నుంచి పైపులను స్వాధీనపర్చుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్ వివరించారు. గ్రామంలోని ఓ పార్టీ నాయకుడు పంచాయతీ పైపులను ఒక్కో దానికి రూ.వేయి చొప్పున సుమారు 90 పైపులను విక్రయించారని విచారణలో తేలినట్లు సమాచారం.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

ఎల్లారెడ్డిపేట, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అద్దెకు ఉంటున్న మదురాల నర్సయ్య ఇల్లు ప్రమాదవశాత్తు మంగళవారం దగ్ధమైంది. తాళం వేసిన ఇంటి గదుల నుంచి మంటలు వ్యాపించడంతో చుట్టు పక్కల వారు ఆయనకు సమాచారం అందించారు. అక్కడి చేరుకునే సరికి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు ఆర్పేందుకు యత్నించారు. ఇంటిలోని విలువైన పత్రాలు, వస్తువులు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు చేరుకుని స్థానికుల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనలో సుమారు రూ.2లక్షల నష్టం వాట్లిందని బాధితులు పేర్కొన్నారు.

15 మందికి జరిమానా

ఇల్లంతకుంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో మద్యంసేవించి వాహనాలు నడిపిన 15మందికి జరిమానా విధించినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం కోర్టు కానిస్టేబుల్స్ తిరుపతి, జీవన్ మద్యంసేవించి వాహనాలు నడిపిన వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. జిల్లా సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జయశ్రీ 12మందికి రూ.1000, మరో ముగ్గురికి రూ 5వేల చొప్పున జరిమానా విధించారు.

గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్య

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నదిలో దూకి పంపరి అజయ్ (34) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. హుజూరాబాద్‌కు చెందిన అజయ్ తల్లి ఇటీవల మృతిచెందగా అజయ్ ఇంటిలో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నెల 11న తల్లి పెద్ద ఖర్మ ఉండగా 9న అజయ్ ధర్మపురికి వచ్చాడు. అదే రోజు గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. రాయపట్నం వద్ద గోదావరి నదిలో మంగళవారం మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. అజయ్ సోదరి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.


పీజీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ వరలక్ష్మి

గణేశ్‌నగర్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్ ఆగస్టులో నిర్వహించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల రెండో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.వరలక్ష్మి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కళాశాలలో ఉన్న ఏడు పీజీ కోర్సుల్లో 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో విద్యార్థినులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల పరీక్షల అదనపు నియంత్రణాధికారులు పాల్గొన్నారు.

మాయమైపోతున్న మానవత్వం



- చిన్నచిన్న కారణాలతో కుటుంబసభ్యుల హత్యలు
- కాలయములుగా మారుతున్న కన్నవారు

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో నానాటికి పెరిగిపోతున్న నేరాల తీవ్ర తను చూస్తే మనుషుల విపరీతమైన నేర ప్రవర్తనపై అసహ్యం వేస్తున్నది. మనుషుల మధ్య ప్రేమలు, ఆప్యాయతలు, అనురాగాలు మాయమవుతున్నాయి. మనుషులు డబ్బులు, సంపదపై మమ కారాన్ని పెంచుకుంటుండంతో మానవ సంబంధాలు మాయమవుతున్నాయి. భర్తను భార్య హత మార్చడం, భార్యను భర్త హత్య చేయడం, తండ్రిని కొడుకు, కొడుకు, కూతుర్లను తండ్రి చంపడం వంటి ఘటనలు అందరిని కలచి వేస్తున్నాయి. నాగరిక సమాజంలో ఆటవికమైన నేర ఘటనలు చోటు చేసు కోవడం విచారకరం. జిల్లాలో ఇటీవల జరుగుతున్న వరుస సంఘటనలు సర్వత్రా ఆందోళన రేకెత్తిస్తు న్నాయి.

● దివ్యాంగులైన పిల్లలను వదిలించుకునేందుకు..

తాజాగా కన్నతండ్రే దివ్యాంగులైన కన్న కూతురిన హత్య చేసి, కొడుకును హత్య చేసేందుకు యత్నించిన ఘటన కరీంనగర్‌లో చోటు చేసుకుంది. కన్న పిల్లలను అల్లారుముద్దుగా చూసుకోవాల్సిన తండ్రే ఆ దివ్యాంగుల పాలిట కాలయముడవ ఇం దారుణం. పోషణ భారమవతున్నదనే కారణంగానే తన కూతురు, కొడుకును కనికరం లేకుండా విషంఇచ్చి హతమార్చే యత్నం చేశాడు. అది విఫలమవటంతో టవల్‌తో గొంతుకు ఉరిబిగించి చంపాలని ప్రయత్నించాడు. కూతురు మరణించింది. కొడుకు కొన ఊపిరితో ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నాడు. అనంతరం తండ్రి మల్లేశం ఇంటి నుంచి పరారుకాగా రెండు రోజుల తరువాత త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు.

● మరో ఘటనలో 2020 ఫిబ్రవరి 10న కరీంనగర్‌లోని విద్యాగనర్ ప్రాంతంలో ఇంటర్ చదువుతున్న ముత్త రాధిక(17) అనే దివ్యాంగులరాలిని ఆమె కన్న తండ్రి కొమురయ్య కత్తితో గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. ఆపై గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. సంఘటనా స్థలంలో సీసీ కెమెరాలు, సెల్‌టవర్ డంపును పరిశీలించిన పోలీసులకు అనుమానంవేసి లోతుగా విచారణ జరపగా తండ్రే హత్య చేసినట్లు వెల్లడైంది. నిందితుడు ఘటనస్థలంలో ఎలాంటి ఆధా రాలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ అప్పటి పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో కీలక ఆధారాలను సేకరించారు. ఎంత డబ్బు ఖర్చుచేసినా దివ్యాంగురాలి ఆరోగ్యం బాగుపడటంలేదని హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ రెండు ఘటనల్లో తండ్రులైన నిందితులు కన్నకూతుర్లను అల్లారు ముద్దుగా చూసుకోవాల్సిందిపోయి, చిన్నతనం లో గోరుముద్దలు తినిపించిన తండ్రులే అవే చేతులతో కర్కశంగా చంపివేశారు. జిల్లాలో జరిగిన ఈ రెండు ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి.

● ఆస్తి తగాదాలతో

జిల్లాలో ఆస్తి తగాదాలతో తండ్రులను కొడుకులు హతమార్చటం, సోదరులు ఒకరిని ఒకరు చంపటం, వివాహేతర సంబంధాలతో భార్య భర్తను, భర్త భార్యను, ప్రియురాలిని హత్య చేసిన ఘటనలు చాలానే జరిగాయి. ఇటీవల కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ వివాహేతర సంబంధంతో ప్రియుడితో కలిసి మద్యంలో పురుగుమందు తాగించి భర్తను హత్య చేయించింది.అంతకు ముందు భగత్‌నగర్‌లో ప్రియురాలిని ప్రియుడు ఇంటికి పిలిచి బండరాయితోబాది హత్య చేశాడు. కొన్నేళ్ల క్రితం భగత్‌నగర్ ప్రాంతంలో దంపతుల నిద్రకు ఆటంకం కలిగిస్తూ రాత్రివేళ ఏడుస్తున్నదనే కారణంగా ఏడాది వయస్సున్న చిన్నారిని కన్నతల్లి నీటి సంపులో వేసి చంపింది. విద్యానగర్ ప్రాంతంలో ఆస్తి తగాదాలతో సోదరుడిని అతనిసోదరే రోకలిబండతో బాదిహత్య చేసింది.

వరుస చోరీలతో బెంబేలు

గన్నేరువరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలో రంగనవేని మల్లయ్యకు చెందిన రెండు దూడలను దొంగలు ఎత్తుకెళ్లారు. వాటి విలువ సుమారు 50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. అదే రాత్రి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న హనుమాన్ ఆలయంలోని పెద్ద కంచు గంటను దొంగిలించారు. స్థానిక భక్తులు మంగళవారం ఉదయం చోరీకి గురైనట్లు గుర్తించారు. అదే ఆలయంలో గతంలో హుండీని దొంగలు ఎత్తుకెళ్లారు. మూడు రోజుల క్రితం గునుకుల కొండాపూర్‌లో పలువురు రైతులకు చెందిన నాలుగు ఆవులను దొంగలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. నగునూర్, బొమ్మకల్ లారీ అసోసియేషన్ వద్ద ట్రాక్టర్లను పట్టుకున్నట్లు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గన్నేరువరం : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని గుండ్లపల్లి వద్ద పట్టుకున్నట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం. మంగళవారం మండలంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుండ్లపల్లి హనుమాన్ ఆలయం వద్ద ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను తనిఖీ చేసినట్లు చెప్పారు. సరైన పత్రాలు లేకపోవడం, అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

● వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన



వేదాన్స్(ఫైల్)

కోరుట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం వేదాన్స్ (5) అనే బాలుడు మృతి చెందాడు. వైద్యుడి నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందాడని ఆరోపిస్తూ ఆసుపత్రిలో కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయికల్‌కు చెందిన పొలాస విజయ్-నందిత దంపతులు కుమారుడు వేదాన్స్‌తో కలిసి పట్టణంలోని ప్రకాశం రోడ్డులో ఉంటున్నారు. సోమవారం తీవ్ర జ్వరంతో బాధపతుండంగా వేదాన్స్‌ను కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ చిల్డన్స్ ఆసుప్రతిలో చికిత్స కోసం తీసుకు వచ్చారు. బాలుడిని పరీక్షించిన వైద్యుడు మందులు రాసి ఇవ్వగా ఇంటికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో రాత్రి సమయంలో వేదాన్స్‌కు తీవ్ర జ్వరం రాగా మరోమారు ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షలు నిర్వహించిన వైద్యుడు ఆసుపత్రిలో అడ్మిట్ చేయాలని సూచించగా తల్లిదండ్రులు సమ్మతించకపోవడంతో మరోమారు మందులను ఇచ్చి పంపాడు. మంగళవారం ఉదయం వేదాన్స్ తీవ్ర అస్వస్థతకు గురికాగా బంధువులు ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో వైద్యుడు బాలుడికి వైద్యం అందిస్తున్న సమయంలో మరింత తీవ్ర అస్వస్థతకు గురికాగా వైద్యుడు సీపీఆర్ చేసి రికవరీకి ప్రయత్నించాడు. అదే సమయంలో బాలుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బంధువులకు సమాచారం అందించారు. ఆసుపత్రికి చేరుకున్న బంధువులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చిరంజీవి తన సిబ్బందితో అక్కడ చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు అంజిరెడ్డి, మెడికల్ అధికారి ఉపెందర్‌లు ఆసుపత్రికి చేరుకొని బాలుడిని పరిశీలించి శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యుడు మాట్లాడుతూ తాను చేసిన వైద్యంలో ఎలాంటి పొరపాటు లేదని, బాలుడిని ఆసుపత్రిలో ఉంచాలని తల్లిదండ్రులను కోరినప్పటికీ చేర్పించలేదని తెలిపారు. చివరికి స్థానిక ఐఎంఏ సభ్యులు మృతుడి బంధువులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

సెస్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు

● రికార్డులను స్వాధీనం చేసుకున్న అధికారులు



సిరిసిల్ల సెస్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘంలో మంగళవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సెస్‌లో జరుగుతున్న పలు అవినీతి అక్రమాలపై ఇటీవల పలువురు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్ నుంచి విజిలెన్స్ సీఐ అనిల్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏఈ శ్రీకాంత్‌గౌడ్‌లు బృందాలతో సెస్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలకు చెందిన పలు రికార్డులతో పాటు కంప్యూటర్‌లలో ఉన్న వివరాలను కాపీ చేసుకుని తీసుకెళ్లారు. దీనిపై సెస్ ఎండీని వివరణ కోరగా పలు ఫిర్యాదులకు సంబంధించి విచారణకు వచ్చి వారికి అవసరమైన రికార్డులను తీసుకెళ్లారని తెలిపారు.

వీఏవోపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వీఏవోలు

గంభీరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం ముచ్చర్ల నూతన గ్రామ సంఘం వీవోఏ విస్లావత్ పద్మపై కొందరు దాడి చేసి గాయ పర్చారని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవా లని స్థానిక తహసీల్దార్ మారుతిరెడ్డికి మండల వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు కురాకుల దేవలక్ష్మి మంగళవారం ఫిర్యాదు చేసింది. ప్రభు త్వం మహిళా సంఘాలకు కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్ప గించగా, ముచ్చర్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బాధ్యతలు నిర్వహిస్తున్న పద్మపై ఐదుగురు దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐ అనిల్‌కుమార్‌ను అడగా, ఫిర్యాదు ఇచ్చిన రోజే వారిపై కేసు నమో దు చేశామని తెలిపారు.

గంజాయి స్వాధీనం

ముగ్గురు యువకుల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని రాపల్లివాగు వంతెన వద్ద గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో వల పన్ని ముగ్గురు యువకులను పట్టుకుని అరెస్ట్ చేశామని సీఐ శ్రీనివాస్ మంగళవారం పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 150 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనపర్చుకున్నామని తెలిపారు. సీఐ శ్రీనివాస్ కథనం మేరకు.. మండల కేంద్రంతో పాటు నారాయణపూర్ గ్రామాలకు చెందిన యువకులు మంద ప్రశాంత్, గసగోని అరవింద్, బుర్క సాయిరాజులు కలిసి కరీంనగర్ జిల్లాలోని గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నారు. కొంత గంజాయిని తాగడంతో పాటు మిగిలిన దానిని మండలంలోని చుట్టు పక్కల గ్రామాలకు చెందిన యువకులు విక్రయిస్తున్నారు. మండల కేంద్రం శివారులోని రాపల్లి వాగు వంతెన వద్ద ఈ నెల 17న గంజాయి అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ముగ్గురు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాయని పేర్కొన్నారు. గంజాయి విక్రయాలు, సరఫరా, తాగే వారి వివరాలను 100 నంబర్‌కు సమాచారం అందించాలని సీఐ శ్రీనివాస్ కోరారు.

భూవివాదంలో బెదిరించిన ఐదుగురిపై కేసు

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ గౌతమి నగర్‌కు చెందిన 944/బిలోని 270 గజాల స్థలం వివాదంలో బెదిరింపులకు పాల్పడ్డారని మానకొండూర్ మండలం చెంజర్లకు చెందిన బోళ్ల సత్యనారాయణ ఫిర్యాదుతో ఐదుగురిపై కరీంనగర్ వన్‌టౌన్‌లో సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ రాంచందర్‌రావు తెలిపారు. భూవివాదంపై మాట్లాడుకుందామంటూ ఈ నెల 12న తనను కరీంనగర్‌లోని సీపీఐ కార్యాలయానికి పిలిపించారని, బయటకు వెళ్లకుండా అడ్డుకొని బెదిరింపులకు పాల్పడ్డారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. స్థలం నుంచి ఖాళీ చేయకుంటే తీవ్రపరిణామాలుంటాయని, కాంపౌండ్‌ను కూల్చి వేస్తామని బెదిరించారని తెలిపాడు. ఈ మేరకు పంజాల శ్రీనివాస్, కొయ్యడ సృజన్‌కుమార్, న్యాలపట్ల రాజు, బండ రాజిరెడ్డి, రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్న కేంద్రం

● సీపీఐ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

హుజూరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దోచిపెడుతోందని సీపీఐ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సీపీఐ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాల ప్రచార జాతా మంగళవారం హుజూరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులు శాంతిచర్చలకు సిద్ధంగా ఉన్నామని పదేపదే చెప్పిన కూడా కేంద్ర ప్రభుత్వం ఎన్‌కౌంటర్లకు పాల్పడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. శాంతి చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వ భద్రత విభాగాల వైఫల్యం వల్లనే కశ్మీర్, ఢిల్లీలో పేలుళ్ల జరిగాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కళావేన శంకర్, ఏఐయూఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, నాయకులు అనిల్, నర్సింహ, రెహమాన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, కేదారి, బాబు, సృజన్‌కుమార్, లక్ష్మి, వెంకటేష్, అయిలయ్య, రత్నాకర్, మల్లేష్, సత్యనారాయణ, రాము, సాగర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

వేగవంతంగా పూర్తి చేయాలి

● హడ్కో రాష్ట్ర అధికారి జనార్దన్



మల్యాల మండలం సర్వాపూర్‌లో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

మల్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని హడ్కో రాష్ట్ర అధికారి జనార్దన్ పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్ట్ ద్వారా మల్యాల మండలంలోని సర్వాపూర్‌లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం హడ్కో అధికారులు పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలు అన్ని పూర్తి చేసి గ్రామాన్ని ఆదర్శంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉంచకుండా పూర్తి చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని అన్నారు. జిల్లా హౌసింగ్ పీడీ ప్రసాద్, అధికారులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు ప్రారంభం

● రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట : జనక్‌ప్రసాద్



స్విమ్మింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జనక్‌ప్రసాద్

రామగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సెంటినరీకాలనీలోని సింగరేణి సౌజన్యంతో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలను మంగళవారం జనక్‌ప్రసాద్, గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మినిమం వేజ్‌బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, ఏసీపీ రమేష్‌లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని అన్నారు. క్రీడలతో క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవడుతాయన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. పాఠశాలలో ఆటలకు ఒక పీరియడ్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసినట్లు తెలిపారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా చూడాలన్నారు. సింగరేణి స్టేడియంలో సమాజ హితమైన పనులకు అవకాశం కల్పిస్తామన్నారు. అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ మాట్లాడుతూ మొదటి సారిగా రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీ లను పెద్దపల్లి జిల్లాలో నిర్వహించడం గర్వకారణ మని, రాబోయే రోజుల్లో మరి న్ని పోటీలను నిర్వహించే ప్రయత్నం చేస్తామన్నారు. జిల్లా యువజన క్రీడల అభివృ ద్ధి అధికారి అక్కపాక సురేష్, ప్రకాశం, రాష్ట్ర బాధ్యులు శోభారాణి, శ్రీనివాస్, పేట సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సురేందర్, దాసరి రమేష్, టోర్నమెంట్ అబ్జర్వర్ శ్రీనివాస్, అధికారులు శశికుమార్, శ్రీకాంత్, వ్యాయామ ఉపాధ్యాయులు శైలజ, మాధవి, జావీద్, వెంకటేష్, దుర్గాప్రసాద్, ఖాజా బీ, రేణుక, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 52 మంది ఎంపిక

సెంటినరీకాలనీ రాణిరుద్రమాదేవి క్రీడా ప్రాంగణంలో అండర్-14 రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు వేదికైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు ఉమ్మడి పది జిల్లాల నుంచి 277 మంది క్రీడాకారులు హాజరయ్యారు. తొలుత ఎంపిక పోటీలో 52 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. అందులో 26 మంది బాలురు, 26 మంది బాలికలు ఉన్నారు. వీరికి సింగరేణి సిటూ టైప్ క్వార్టర్‌లను వసతి కోసం కల్పించింది. రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన క్రీడాకారులను ఈ నెల 30 ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటారని నిర్వాహకుడు లక్ష్మణ్ తెలిపారు.

చెరువులో బావి తవ్వకంపై విచారణ



బావి తవ్వకంపై విచారణ నిర్వహిస్తున్న అధికారులు

చందుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని కొత్త చెరువులో బావి తవ్వకంపై అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామ శివారులోని కొత్తచెరువులో ఓ వ్యక్తి బావి తవ్వుతున్నాడని పోలీసులకు ఫిర్యాదు అందడంతో వారు పనులు నిలిపివేయించారు. మంగళవారం పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు ఆ ప్రదేశానికి వెళ్లి విచారణ చేపట్టారు. బావి తవ్వే వ్యక్తిని భూమి పట్టా సంబంధించిన పాసుబుక్‌లను తీసుకొని రావాల్సిందిగా సూచించినట్లు అధికారులు తెలిపారు. విచారణ జరిపిన వారిలో ఇరిగేషన్ ఏఈ నవీన్, ఆర్‌ఐ శ్రీనివాస్, ఏఎస్‌ఐ ఆనంద్, సర్వేయర్ చామంతి, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్, మణికంఠ, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

నేడు వేములవాడలో హుండీ లెక్కింపు

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో నిండిన హుండీలను బుధవారం లెక్కిస్తామని ఆలయ ఏఈఓ బ్రహ్మన్నగారి శ్రీనివాస్ తెలిపారు. ఈ హుండీలను ఆలయ ఓపెన్ స్లాబ్‌లో భారీ భద్రత మధ్య లెక్కించనున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద

జగిత్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో మంగళవారం నీటి మట్టం నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి 9,338 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 9,338 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

పంచాయతీ ఎన్నికల నిర్ణయం ఉపసంహరించుకోవాలి

- బీసీ సాధికారిత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్

వేములవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరులో పంచాయతీ ఎన్నికలను పార్టీ పరంగా రిజర్వేషన్లతో నిర్వహించేందుకు కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బీసీ సాధికారిత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరులో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లుల ఆమోదానికి రాష్ట్ర ఎంపీలు ఒత్తిడి తేవాలని, లేదా రాజీనామా చేసేందుకు సిద్ధపడాలని సూచించారు. ఈ సమావేశంలో చింతలోటి రామస్వామి, బుర్రదశగౌడ్, హేలపతి, దేవయ్య, ఒన్నారపు దేవయ్య, గణేష్, తిరుపతి, ప్రభాకర్, రవీందర్, రాజేష్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

- పనిచేయని వేడినీళ్ల ప్లాంటు
- ఆరుబయటనే పుట్టువెంట్రుకలు
- కోడెల క్యూలైన్ పక్కనే నిర్మాణ సామగ్రి


కోడెల క్యూలైన్ పక్కనే నిర్మాణ సామగ్రి


ఇరుకైన కల్యాణకట్టలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

కల్యాణ కట్ట.. సమస్యల తిష్ఠ

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారికి తలనీలాలు సమర్పించే కల్యాణకట్ట సమస్యలకు తిష్టగా మారింది. కార్తీక మాసం సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. రాజన్న సన్నిధిలో రూ.150కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో రావిచెట్టు వద్ద ఉన్న కల్యాణకట్ట-1ను చెక్‌పోస్టు వద్దకు మార్చారు. మరో కల్యాణకట్ట-2ను అమ్మవారి గెస్ట్ హౌస్ వద్ద తాత్కాలికంగా టెంట్లువేసి కొనసాగిస్తున్నారు. ఈ కల్యాణకట్టను రాజేశ్వరపురం కిందిభాగంలో ఏర్పాటు చేయాలని రూపకల్పన చేసినప్పటికీ ముందుకు సాగడంలేదు. తలనీలాల కాంట్రాక్టు ద్వారా ఆలయానికి ఏటా రూ. 15కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ కల్యాణకట్టలో భక్తులు తలనీలాలు సమర్పించడం ఇబ్బందిగా మారింది. కల్యాణకట్టలో భక్తులకు అవసరమైన కనీస సౌకర్యాలు కరువయ్యాయి. చిన్నారులకు పుట్టువెంట్రుకలు తీసేందుకు అవసరమైన నీడ కరువైంది. కల్యాణకట్టకు ఎదురుగా ఆరుబయటనే చిన్నారులకు పుట్టు వెంట్రుకలు తీస్తున్నారు. కల్యాణకట్ట వద్ద చిన్నారులకు వేడినీళ్లు లభించక చలికి విలవిలలాడుతున్నారు. పార్వతీపురం-1 బ్లాక్ వద్ద వేడినీళ్ల ప్లాంటు ఏర్పరిచి నప్పటికీ ఉపయోగపడడం లేదు. కల్యాణకట్టకు కొంత దూరంగా ఉండడంతో బయటనే వేడినీళ్లు తెచ్చుకొని చిన్నారులకు స్నానాలు చేయిస్తున్నారు. పార్కింగ్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన నల్లాల వద్దనే భక్తులు స్నానాలు చేస్తున్నారు. ఇవి దూరంగా ఉండడంతో భక్తుల స్నానాలకు ఇబ్బందులు నెలకొన్నాయి. అసౌకర్యాల మధ్య భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. రాజేశ్వరపురం చివరన కిందిభాగంలో భక్తుల స్నానాల కోసం ప్రత్యేక లైన్ ఏర్పరిచి నల్లాల పాయింట్ ఏర్పరిచారు. ఇప్పటివరకు ఫ్లోరింగ్ మొదలు పెట్టలేదు. భక్తుల సౌకర్యార్థం దాదాపు 120 నల్లాలను బిగించడానికి రూప కల్పన చేసినప్పటికీ కార్యరూపం దాల్చడంలేదు. సమ్మక్క, సారక్క జాతర సమీపిస్తున్న నేప థ్యంలో ఇప్పటికైనా పూర్తిసౌకర్యాలతో కల్యాణ కట్టను ఏర్పాటు చేసి భక్తుల ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది.

● ధర్మగుండం మూసివేత

ఆలయ విస్తరణ పనుల నేపథ్యంలో ధర్మగుండంను మూసివేశారు. అయితే కార్తీక మాసం సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలకు చోటేలేదు. భీమేశ్వరస్వామి ఆలయంలో దర్శనాలు, ఆర్జిత సేవలు చేసుకునే భక్తులు పుణ్యస్నానాలు చేయాలంటే వసతిగదులే తప్ప ఎక్కడా చోటు లేదు. ఆలయ పార్కింగ్ ప్రాంతంలో ఉన్న కొద్దిపాటి నల్లాల వద్ద స్నానాలు చేయడం భక్తులకు ఇబ్బందిగా మారింది. మహిళలకు డ్రెస్సింగ్ రూంలు లేకపోవడంతో కష్టంగా మారింది.

● భీమేశ్వరసదన్ ఎదుట బురదమయం

ప్రసాదాల తయారీతో వచ్చే నీటితో భీమేశ్వర సదన్ ఎదుట బురదమయంగా మారింది. భీమేశ్వరసదన్‌లోనే ఈవో, ఇంజనీరింగ్, ప్రొటోకాల్ కార్యాలయాలు ఉన్నాయి. ముఖ్య బుకింగ్‌కు పక్కన సదన్ ఎదుట బురదగా మారడంతో ఆలయానికి వచ్చే వీఐపీలు, కార్యాలయాలకు వెళ్లే అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. మరోవైపు కోడెల క్యూలైన్ పక్కనే అభివృద్ధి పనులకు ఉపయోగించే ఇసుక, కంకర ఉండడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు.


బురదగా మారిన భీమేశ్వర సదన్ ప్రధాన ద్వారం

కల్యాణకట్ట-2ను 20రోజుల్లో పూర్తిచేస్తాం

- రాజేష్, ఈఈ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం

కళ్యాణకట్ట-2ను 20రోజుల్లో పూర్తిచేస్తాం. భక్తుల స్నానాలకు దాదాపు 120 నల్లాల ద్వారా షెవర్స్‌ను ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం కళ్యాణకట్ట-1లో తలనీలాలు సమర్పించే భక్తుల సౌకర్యార్థం వెనుకభాగాన నల్లాలు ఏర్పాటు చేశాం. ఇక్కడ త్వరలో ఫ్లోరింగ్ చేసి నల్లాలు వినియోగంలోకి తీసుకువస్తాం. ఇందుకు రూ. 15లక్షలు కేటాయించాం. భీమేశ్వర ఆలయంలో రూ. 3.60కోట్ల అభివృద్ధి పనుల నేపథ్యంలో నిర్మాణానికి క్యూలైన్ పక్కన వేసిన మెటీరియల్ తొలగిస్తాం.

బద్దిపోచమ్మ సన్నిధిలో భక్తుల సందడి

● అమ్మవారికి బోనం సమర్పించేందుకు చలిలోనే క్యూ


అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా వేములవాడ భీమేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులతో బద్దిపోచమ్మ దేవాలయం వద్ద భక్తజన సందడి నెలకొంది. మంగళవారం వేములవాడ పట్టణంలోని బద్దిపోచమ్మ ఆలయంలో వేలాదిమంది భక్తులు అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు తెల్లవారుజామునే క్యూ కట్టారు. వీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించడంతో భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. బద్దిపోచమ్మ ఆలయం ఎదురుగానే నీటి గుంత ఏర్పడడంతో భక్తులు ఇబ్బందుల పాలయ్యారు.

భీమేశ్వరాలయంలో కార్తీక వైభవం

కార్తీకమాసం సందర్భంగా భీమేశ్వరాలయంలో కార్తీక వైభవం నెలకొంది. మంగళవారం భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సుహాసినిలు కార్తీక దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తిని చాటారు. అనంతరం సుహాసినిలకు వాయనం అందజేశారు.

బీడి కార్మికుల పిల్లల ఉపకారవేతనాలు

● ఈ నెల 30 వరకు గడువు పెంపు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ, వెల్ఫేర్ కమిషనర్, లేబర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు బీడి కార్మికుల పిల్లలకు ప్రోత్సాహక ఉపకారవేతనాలు దరఖాస్తులు ఈ నెల 30 వరకు పొడిగించినట్లు జిల్లా బీడీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ప్రభుత్వ ఆమోదిత కళాశాలలు ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్, ఎంబీఏ, ఎంబీబీఎస్, ఎంసీఏ కోర్సులు చదివే విద్యార్థులకు ఈ అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ప్రోత్సహించి నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లితండ్రులకు రూ. 1,20,000 లోపు ఆదాయం కలిగి ఉండాలని, గత సంవత్సర విద్యార్థి మార్క్స్ మెమో, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, తల్లి లేదా తండ్రి బీడీ కంపెనీ ఐడీ కార్డుతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ


కొండగట్టులో భక్తులు

మల్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా వచ్చిన భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనంకు బారులు తీరి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీకమాసంతో పాటు సమ్మక్క సారలమ్మ జాతర రానున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, అధికారులు పర్యవేక్షించారు. అంజన్నను దర్శించుకున్న భక్తులు బేతాళుడు, శ్రీరాముని ఆలయంలోనూ పూజలు జరిపారు. కాడా వైజంక్షన్, ఘాట్ రోడ్డుపై వాహనాల రాకపోకలకు అరగంట సమయం పట్టడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ధర్మపురి క్షేత్రంలో ఘనంగా గోదావరి హారతి


ధర్మపురిలో గోదావరికి హారతి ఇస్తున్న మంత్రి అడ్లూరి తదితరులు


కోటిలింగాలలో సామూహిక సత్యనారాయణ వ్రతం చేస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 28వ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గోదావరి నది వద్ద హారతి పూజల్లో పాల్గొన్నారు. అత్యంత గోదావరి నది మాతకు హారతి ఇచ్చి నదిలో కార్తీక దీపం వదిలి పెట్టారు, ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, సీఐ రాంనర్సింహారెడ్డి, ధర్మకర్తలు ఏదులాపురం మహేందర్, గుడ్ల రవీందర్, రాపర్తి సాయికిరణ్, నేదునూరి శ్రీధర్, బాదినేని వెంకటేష్, ఒజ్జల సౌజన్యానరేందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ధర్మపురి వద్ద గోదావరి హారతి కార్యక్రమాన్ని నిర్వహించడం పరమ పవిత్రమని కార్యక్రమంలో పాల్గొడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. రాబోవు కాలంలో గోదావరి పుష్కరాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. గోదావరి నది వద్ద మురికి నీరు కలువకుండా సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) ఏర్పాటు చేస్తామన్నారు.

కోటిలింగాలలో ప్రత్యేక పూజలు

వెల్గటూర్: కోటిలింగాల కోటేశ్వరస్వామి వారికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భక్తితో కార్తీక దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మ, కార్తీక్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారికి అభిషేకం, అర్చన, అన్నపూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, రాపాక కోటయ్య పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ పట్టివేత


పోలీసులు పట్టుకున్న టిప్పర్

రుద్రంగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం ఉదయం ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. జగిత్యాల జిల్లా, కథలాపూర్ మండలం నుంచి రుద్రంగి మండల కేంద్రానికి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకుని చందుర్తి సర్కిల్ కార్యాలయానికి తరలించారు. అక్రమంగా ఎవరైనా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

మానసాదేవి ఆలయంలో భక్తుల రద్దీ


మానసాదేవి ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు

గన్నేరువరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయానికి కార్తీక మాసం చివరి మంగళవారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులతో ఆలయ ప్రాగంణం కిక్కిరిసింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలు, సత్యనారాయణ వ్రతాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కోనేటిలోని జంటనాగ శివలింగ ప్రతిమలకు జలాభిషేకం చేశారు. ఆలయ ఆవరణలో మహిళలు దీపాలను వెలిగించగంతో కార్తీక శోభను సంతరించుకుంది.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

మల్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని టి. కమలిని రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. సిల్వర్ మెడల్ సాధించిన కమలినిని పాఠశాలలో అభినందించారు.

గొర్రెల పెంపకందారుల కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గం

కరీంనగర్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షు డిగా కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తికి చెందిన బాసవేని మల్లేశం యాదవ్ ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జిల్లా పశు వైద్య అధికారి లింగారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన జిల్లా పాలక వర్గాన్ని ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా అగిత రవీందర్, కటిక రెడ్డి బుచ్చన్న, కాల్వ సురేష్, గడ్డి శ్రీనివాస్, చిగుర్ల శ్రీనివాస్, చౌటపల్లి రంజిత్, దాడి అంజనేయులు, దాడి సదయ్య, దానె ఓదెలు, బద్దుల రాజ్ కుమార్, ముక్కెర సదానందం ఎన్నికయ్యారు.

సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ పరిధి వీర్లపల్లెలో మంగళవారం రాత్రి ఉరివేసుకుని అన్నబోయిన శ్యాంసుందర్(45) అనే సింగరేణి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మందమర్రి ఏరియాలోని శాంతిఖని గనిలో జనరల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్యాంసుందర్ కొంతకాలంగా మద్యానికి బానిసై విధులకు గైర్హాజరు అవుతున్నాడు. దీంతో శ్యాంసుందర్ భార్య నాలుగు నెలల క్రితం కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి సక్రమంగా డ్యూటీలు చేయకుండా అతిగా మద్యం సేవిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం వీర్లపల్లె శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


వేములవాడలో పేరిణి శివతాండవ నృత్యం

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా వేములవాడ శ్రీ భీమేశ్వర సదన్ ఆవరణలో మంగళవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా కళాకారులు ప్రదర్శించిన పేరిణి శివతాండవ నృత్యం ఆకట్టుకుంది. కళాకారులు ప్రదర్శించిన ఆంధ్రనాట్యం అలరించింది. ఈ సాంస్కృతిక ప్రదర్శనల్లో ఆచార్య గురు కళాకృష్ణ ఆధ్వర్యంలో పుష్పాంజలి, దేవి స్తోత్రం, పంచలింగ స్తోత్రం , మేలప్రాప్తి, శివపంచలింగ శబ్దాలు తదితర నృత్య ప్రదన్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రదర్శనలు తిలకించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కళాకారులు సత్కరించారు. అనంతరం కళాకారులను విప్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇవో రమాదేవి, డీఈలు రఘునందన్, మహిపాల్‌రెడ్డి, ఏఈఓ శ్రావణ్‌కుమార్, జయకుమారి, బ్రహ్మన్న గారి శ్రీనివాస్, జి. అశోక్‌కుమార్‌లు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న ఆంధ్రనాట్య ప్రదర్శన

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం


కల్యాణానికి హాజరైన భక్తులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండలం మానాల గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణానికి రాష్ట్ర యూనియన్ కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. స్వామి వారి కళ్యాణానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, తర్రె మనోహర్ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, జక్కు మోహన్, పిసరి చిన్నభూమయ్య ఉన్నారు.

భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

● ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : వేములవాడకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం భక్తులకు కల్పించాల్సిన వసతులపై జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్ గరిమా అగర్వాల్, ఎస్పీ మహేష్‌బీగీతే, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ముందుగా భీమేశ్వరస్వామి ఆలయానికి రోజుకు ఎంతమంది భక్తులు వస్తున్నారని ఏఏ మొక్కులు చెల్లించుకుంటున్నారనని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భీమేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆలయంలో వసతులు కల్పించాలని సూచించారు. క్యూలైన్‌లు, వివిధ ప్రత్యేకపూజలు, మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం ముందు ఉన్నరావి చెట్టు వద్ద భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. ఈవో రమాదేవి, ఆర్డీవో రాధాబాయ్, ఆర్అండ్‌బీ ఈఈ నరసింహాచారీ, ఈఈ రాజేష్ పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

● న్యూస్‌బాక్స్

రేపు కార్తీక దీపోత్సవం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగర శివారులోని వేదభవనంలో గురువారం సాయంత్రం 6 గంటల నుంచి కార్తీక దీపోత్సవం, లక్ష్మీనారాయణ కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. సాలగ్రామ, కార్తీక దీప దానాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలకు స్పందన

కరీంనగర్ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతి సందర్భంగా భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలను టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. టీటీడీ కార్యక్రమ నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి, కల్యాణ మండప కాంట్రాక్టర్ కొండ శ్రీధరబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

హుజూరాబాద్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


ప్రతిజ్ఞ చేస్తున్న అడిషనల్ కలెక్టర్, సుడా చైర్మన్, అధికారులు

కరీంనగర్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలతో భవిష్యత్ నాశనం అవుతుందని, యువత దూరంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. మంగళవారం కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ ప్రతిమ మెడికల్ కళాశాలలో నిశా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం యాంటి డ్రగ్ ప్రతిజ్ఞ చేయించారు. సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ వెంకట రమణ, ప్రతిమ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిషన్, మెడికల్ సూపరింటెండెంట్ సీఎల్ ప్రాద్, సీఏవో రామచంద్రారావు పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్ఎండీ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సునీత, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీశైలం పాల్గొన్నారు.

● ఎస్ఆర్ఆర్ ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్లో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుజాత, జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ ప్రదీప్‌రాజ్ ప్రతిజ్ఞ చేశారు.

మానకొండూర్: మండల కేంద్రంలోని పల్లె మీద బస్టాండ్ చౌరస్తాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, మానకొండూర్ సీఐ సంజీవ్, ఎంఈవో మధుసూదనాచారి పాల్గొన్నారు.

భగత్‌నగర్: కరీంనగర్ బస్‌స్టేషన్ ఆవరణలోని రీజినల్ మేనేజర్ కార్యాలయంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు, డిప్యూటి రీజినల్ మేనేజర్లు భూపతిరెడ్డి, సత్యనారాయణ, శంకరయ్య, మల్లేశం, జ్యోత్స్న, సత్తయ్య పాల్గొన్నారు.

కరీంనగర్ క్రైం: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సై సయ్యద్ అంజద్, ప్రధానోపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలపై బీజేపీ దృష్టి

(5వ పేజీ తరువాయి)

పాలనలో తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయాలపై కరపత్రాలను రూపొందించి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని కమలనాథులు భావిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణను హుజూరాబాద్ సమావేశంలో ప్రకటించే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

● వ్యూహాత్మకంగా కాంగ్రెస్ అడుగులు

గ్రామ పంచాయతీలపై కాంగ్రెస్ పట్టు సాధించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2019లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే వరకు గ్రామ స్థాయిలో ద్వితీయ శ్రేణి నాయకత్వం కాంగ్రెస్ పార్టీకి లేకుండా పోయింది. అసెంబ్లీలో శాసన సభ్యుల సంఖ్యాబలం ఉన్నా, పంచాయతీల్లో పార్టీకి పట్టు లేకుండా పోయింది. గడిచిన పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ స్థాయిలో పట్టును నిలుపుకున్నది. ఎలాగైనా పంచాయతీ ఎన్నికలు నిర్వహించి గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పటిష్టమవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలంగా తయారు చేసే దిశగా కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నది.

తరుగుపేరుతో ధాన్యం తూకంలో కోతలు

గంగాధర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తరుగు పేరుతో ధాన్యంలో కోతలు విధిస్తున్నారని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆరోపించారు. మంగళవారం గంగాధర మండలం వెంకంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదురు చూస్తున్నా పట్టిం చుకోవడంలేదని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ సర్పంచులు కంకణాల విజేందర్‌రెడ్డి, దామోదర్, మల్లేశం, నాయకులు మహిపాల్‌రావు, ఆకుల మధుసూదన్, సురేందర్, దుర్గయ్య పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

హుజూరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కు లను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఆడబిడ్డలకు చెక్కుల పంపిణీ చేయడానికి ప్రభుత్వం అడ్డు తగులుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు తులం బంగారం ఇస్తానని చెప్పి ఆడబిడ్డలను మోసం చేసిందన్నారు.

రామానుజన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ తుదిదశకు అల్ఫోర్స్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామానుజన్ మ్యాథ్స్ ఒలిం పియాడ్ తుది దశకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. పాఠశాలకు చెందిన టి.శ్రీక్షిత, జి.శ్రీయాన్‌రెడ్డి, పి.సాధ్విని, జి.సహాంస్, సహార్ష్, శ్రేయాన్‌కార్తిక్ తుదిదశకు చేరుకోవడం అభినందనీయమన్నారు.

సబ్ స్టేషన్ పనుల పరిశీలన

గణేశ్‌నగర్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణంలో నిర్మించుతున్న ఇండోర్ సబ్ స్టేషన్ పనులను ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ పి. తిరుమలరావు మంగళవారం పరిశీలించారు. ఎస్ఈ రమేష్ బాబు, డివిజనల్ ఇంజనీర్, పి.రాజం, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్ ఫాతిమారెడ్డి

భగత్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సెయింట్‌జార్జ్ సీబీఎస్ఈ పాఠ శాలకు చెందిన కె.అద్వికానాథ్ టేబుల్ టెన్నిస్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఫాతిమారెడ్డి విద్యార్థిని అభినందించారు.

గోపాల్‌రావుపేట పాఠశాల అటెండర్ సస్పెన్షన్

గంగాధర (రామడుగు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాల్‌రావుపేట జడ్పీపాఠశాల అటెండర్‌ను సస్పెండ్ చేస్తూ జడ్పీ సీఈవో శ్రీనివాస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ రఫీక్ నాలుగు రోజుల క్రితం పాఠశాలలలో షీ టీం సమావేశానికి రఫీక్ మద్యం తాగి హాజరవగా షీ టీం బృందం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది.

రైల్వే స్టేషన్‌ను సందర్శించిన వింధ్యావాలీ విద్యార్థులు


రైల్వే స్టేషన్‌ను తిలకిస్తున్న వింధ్యావాలీ విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావాలీ పాఠశాల ఆరోతరగతి విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా మంగళవారం నగరంలోని రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

రైతులను మభ్యపెడుతున్న బీఆర్ఎస్ నాయకులు

గంగాధర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు రైతులను మభ్య పెడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం వెంకంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకంపల్లి కొనుగోలు కేంద్రంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు షో చేశారన్నారు. బీఆర్ఎస్ పాలనలో 5 నుంచి 6 కిలోలు దోపిడీ చేశారన్నారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరుణాకర్, మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సతీష్ ఉన్నారు.

జానపద గేయాలతో మార్మోగిన గ్రంథాలయం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువు, జ్ఞానం అంశాలపై జానపద గేయాల పోటీ నిర్వహించారు. ఎస్సారార్ కళాశాల రైటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, గ్రంథలయ సంస్థ కార్యదర్శి సరిత విద్యార్థులకు, పాఠకులకు పఠనావశ్యతకతపై వివరించారు.

అందెశ్రీ సంస్మరణ సభ

కరీంనగర్ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాహితీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రేకుర్తిలోని సంస్థ కార్యాలయంలో వాగ్గేయకారుడు అందెశ్రీ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సువార్త మాట్లాడుతూ మానవత్వ విలువలున్న సమాజ నిర్మాణం కోసం రచనలు చేయాలన్నారు. తన పాటలతో అందెశ్రీ సమాజాన్ని మేల్కొలిపారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మానువాడ శంకర్, ఆడెపు రాంనారాయణ, పురుషోత్తం సతీశ్, సంపత్ రమేశ్ మహారాజ్, లక్ష్మీనారాయణ, దేవదాస్, శ్రీనివాస్, శ్యాంకుమార్, రాములు, గంగాధర్, సంపత్, నరసయ్య, రమేష్, వనజ, మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

గణేశ్‌నగర్,నవంబరు18(ఆంధ్రజ్యోతి):అనుమతులు లేని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా జాతీయ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు సిరిశెట్టి రాజేష్ గౌడ్ డిమాండ్ చేశారు. నగరంలో మంగళవారం ఉమ్మడి జిల్లా నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాది విద్యా బ్రాండ్ల పేర్లతో విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్నాయన్నారు. అనుమతులు లేకుండానే కరీంనగర్ జిల్లాలో కోచింగ్ సెంటర్లు నడుస్తున్నాయన్నారు. కోచింగ్ సెంటర్లపై వెంటనే తనిఖీలు చేయాలని విద్యాశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆరిఫ్, అజయ్, ఆసిఫ్, శ్రీకాంత్ రమేష్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు ఏర్పాట్లు

తిమ్మాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మానగర్ ఎల్ఎండీ కాలనీలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవానికి కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. గురుస్వామి కావేటి పరమేశ్వర స్వామి పర్యవేక్షణలో మహోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత మహిళా ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన

మానకొండూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : త్రిదండి రామానుజ చిన జీయర్ సంస్థ వికాస తరంగిణి, చలిమెడ ఆనందరావు మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం మానకొండూర్‌లో నిర్వహించిన ఉచిత మహిళా ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన శిబిరంలో 115 మందికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి జిల్లా అధ్యక్షులు కె. గౌతంరావు, కార్యదర్శి యాద కిషన్, మహిళా క్యాంపు ఇన్‌చార్జిలు టి. శ్రీమతి, ఎం.అశోక్‌రావు, వై.మల్లికార్జున్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలపై నెమలి పడి విద్యుత్ శాఖకు నష్టం

గణేశ్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోర్టు చౌరస్తాలో విద్యుత్ స్టోర్‌లో మంగళవారం సాయంత్రం 33కేవీ చొప్పదండి ఫీడర్‌పై నెమలి పడి నష్టం వాటిల్లింది. షాట్ సర్క్యూట్‌తో స్టోర్‌లో ఉన్న 11కేవీ ఎక్స్‌ఎల్‌పీఈ, కేబుల్ 200 మీటర్లు. దగ్ధమయ్యాయి. సుమారు లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. ఈ సంఘటన స్థలాన్ని వరంగల్ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ తిరుమలరావు పరిశీలించారు.

మున్సిపల్ ఎన్నికలు త్వరగా నిర్వహించాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు త్వరగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాలశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు కోరారు. మంగళవారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రిని రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ సూచన మేరకు నగరపాలక సంస్థ సమస్యలతోపాటు 15వ ఆర్థిక నిధులు, డంపుయార్డు ప్రక్షాళనకు నిధుల విడుదల, మున్సిపల్ ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై వివరించినట్లు తెలిపారు.

మైలారంలో కరీంనగర్ డెయిరీ పశువైద్య శిబిరం

గన్నేరువరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారంలో కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో మంగళవారం మెగా పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పశువైద్య అధికారులు పశువులకు గర్భకోశ నివారణ టీకాలను వేశారు. కార్యక్రమంలో స్థానిక కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేందర్, కరీంనగర్ మేనేజర్ సుధాకర్, డాక్టర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ బాలరాజు, సూపర్‌వైజర్ లక్ష్మీనర్సు పాల్గొన్నారు.

స్నేహితపై అవగాహన

కరీంనగర్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్నేహిత రెండోదశ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు ప్రధానోపాధ్యాయిని పద్మ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్నేహిత రెండో విడత నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, డాక్టర్లు తులసీదాస్,జరీనా, హెచ్‌ఎం తిరుమల పాల్గొన్నారు.

చొప్పదండి : రుక్మాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో మోహన్, ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్‌రావు, స్నేహిత ఇన్‌చార్జి శ్రీవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండలంలోని బొమ్మకల్, అమ్మనగుర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకుడు రమేష్ అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు మారుతి, విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో దందా

● కార్యాలయ ఉద్యోగి ఏజెంట్‌గా మారిన వైనం


ఏంజెట్ల ఫైళ్లకు సంబంధించిన పనులు చేయిస్తున్న నిఖిల్(ఫైల్)

తిమ్మాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏజెంట్ల హవా కొనసాగుతోంది. సొంతంగా ఓ కోడ్ పెట్టుకొని సంబంధిత ఫైల్లపై రాసి వాహనాదారుల వద్ద నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. రవాణా శాఖ సిబ్బందే ఏజెంటుగా అవతారం ఎత్తాడు. కార్యాలయంలో పని చేసే బెదరకొండ నిఖిల్ అనే వాచ్‌మన్ ఏజెంట్‌గా మారి అన్ని పనులు చక్కబెట్టుకుంటున్నాడు. నిఖిల్ రాత్రి వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తించాలి. నిఖిల్ వాచ్‌మన్‌గా కాకుండా ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నాడు. తనకు ఇష్టమొచ్చిన సమయంలో కార్యాలయానికి వచ్చి సిబ్బందితో తన వెంట తెచ్చుకున్న ఏజెంట్ల ఫైల్స్ పనులు దగ్గరుండి చక్కబెడతాడు. వెంట తెచ్చుకున్న ఫైల్స్‌తోపాటు రవాణా సేవల నిమిత్తం అక్కడికి వచ్చే వారిలో కొందరి పనులు చేయిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడు. సాయంత్రం అధికారులు, సిబ్బంది వెళ్ళిన కొద్ది సేపటి తరువాత కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లిపోతాడు. వాచ్‌మన్‌గా రాత్రి వేళలో కార్యాలయంలోనే ఉండాల్సిన నిఖిల్ కార్యాలయంలో కనబడడు. ఈ విషయం డీటీసీ, డీటీవో, ఏవో ఇతర అధికారుల దృష్టికి వెళ్లింది. మంగళవారం కార్యాలయంలోనే ఏజెంట్లకు సంబంధించిన ఫైల్స్‌తో వచ్చి 'ఆంధ్రజ్యోతి' కంట పడ్డాడు. ఈ విషయంపై డీటీసీ పురుషోత్తం, డీటీవోశ్రీకాంత్ చక్రవర్తి, ఏవో అశోక్ కు వివరణ కొరగా గతంలోనే వాచ్‌మన్ నిఖిల్‌ను మందలించామన్నారు. మెమో ఇస్తమని చెప్పామని, అతడిపై వస్తున్న ఆరోపణలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదు

హుజూరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్‌లో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మాయ మాటలు చెప్పి గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా పాలన పేరిట సంబరాలు చేపట్టాలనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. వంద రోజుల్లో పూర్తి చేస్తామన్న ఆరు గ్యారంటీలు అన్ గ్యారంటీలయ్యాయన్నారు. బీసీలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం మళ్లీ డ్రామాలు మొదలు పెట్టిందన్నారు. నేడు హుజూరాబాద్‌లో తలపెట్టిన బూత్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ హాజరుకానున్నట్లు చెప్పారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నరసింహరాజు, నాయకులు పుప్పాల రఘు, గుజ్జ శ్రీనివాస్, కుమార్, రాజు, సంపత్‌రావు, రమణారెడ్డి, నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీజీ ఎన్‌పీడీసీఎల్ అధికారులకు ర్యాంకులు


సన్మానిస్తున్న ఎస్ఈ రమేష్ బాబు

గణేశ్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీజీ ఎన్‌పీడీసీఎల్ కంపెనీ స్థాయిలో వివిధ పారామీటర్లలో అధికారులకు సీఎండీ వరుణ్‌రెడ్డి ర్యాంకులను ప్రకటించారు. కంపెనీ స్థాయిలో కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ రమేష్‌బాబుకు రెండో ర్యాంకు, కరీంనగర్ టౌన్ డివిజన్‌కు కంపెనీ స్థాయిలో జంపాల రాజంకు మొదటి ర్యాంకు, కరీంనగర్ సబ్ డివిజన్ ఏడీఈ ఆపరేషన్ టౌన్-1 పంజాల శ్రీనివాస్ గౌడ్‌కు మొదటి ర్యాంకు లభించాయి. ఏఈ ఆపరేషన్ టౌన్-1 పి.శ్రీనివాస్‌కు రెండో ర్యాంకు, టౌన్ -7 వి.సత్యనారాయణకు మూడో ర్యాంకు, ఉమ్మడి కరీంనగర్ సర్కిల్‌లో డివిజనల్ ఇంజనీర్ హుజూరాబాద్ లక్ష్మారెడ్డికి రెండో ర్యాంకు, ఏఈ ఆపరేషన్ హుజూరాబాద్ టౌన్ శ్రీనివాస్‌కు మొదటి ర్యాంకు లభించాయి. అంతకుముందు జంపాల రాజం, శ్రీనువాస్ గౌడ్‌ను ఎస్ఈ రమేష్‌బాబు అభినందించారు.

టీడీపీ నాయకుడు ఆగయ్య అంత్యక్రియలు

కరీంనగర్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు కళ్యాడపు ఆగయ్య అంత్యక్రియలు అభి మానులు, జన సందోహం మధ్య ముగిశాయి. మంగళవారం నగరంలోని కాపువాడలోని ఆయన స్వగృహం నుంచి తీగల వంతెన వరకు అంతిమయాత్ర కొసాగింది. మాజీ మంత్రులు సుద్దాల దేవయ్య, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, రైతు, ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం పటేల్, మాజీ కార్పొరేటర్లు రవీందర్ గౌడ్, నరేందర్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ శంకర్, మాజీ జడ్పీటీసీ శేఖర్‌గౌడ్, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ పాల్గొన్నారు.

కరీంనగర్ క్రైం: ఆగయ్య నివాసంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వసంతరావు, వంశీధర్ రెడ్డి, సంపత్, ఓంకార్, శ్రవణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల్లో భాగంగా బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మ ధ్యాహ్నం 12 వరకు హౌస్సేన్‌పురా, నాకా చౌరస్తా, గాంధీచౌక్, గణేశ్ చిప్స్ ఏరియా, వ్యవసాయ మార్కెట్, సహేత్‌పురా, అంబే ద్కర్‌నగర్, శివాజీనగర్, ఎస్టీకాలనీ, వాటర్ ట్యాంక్ ఏరియా, రెనే హాస్పిటల్, వావిలాల రమేష్ రెడ్డి నగర్, ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు మంకమ్మతోట, పారమిత స్కూల్, సిద్ధార్థ స్కూల్ ప్రాంతాల్లో ఉండదని పేర్కొన్నారు.

బండ సురేందర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం


నివాళులు అర్పిస్తున్న దేవరాజన్

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని పార్టీ జనరల్ సెక్రెటరీ దేవరాజన్ అన్నారు. అనారోగ్యంతో సోమవారం రాత్రి మరణించిన బండ సురేందర్‌రెడ్డి పార్థివదేహం వద్ద మంగళవారం నివాళులర్పించారు. భౌతికకాయంపై పార్టీ పతాకాన్ని కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండ సురేందర్ రెడ్డి మరణం పార్టీకి లోటన్నారు. అనంతరం సురేందర్‌రెడ్డి అంత్యక్రియలు స్థానిక మానేరు శ్మశానవాటికలో నిర్వహించారు. అంతకు ముందు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, సుద్దాల దేవయ్య, మాజీ ఎమ్మెల్సీల సంతోష్‌కుమార్, నారదాసు లక్ష్మన్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు, కోరుకంటి చందర్, టీయూడబ్ల్యూజే జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు అంబటి జోజిరెడ్డి, తేజ్‌దీప్‌రెడ్డి, ఆర్‌వీ ప్రసాద్, దయానంద్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, బండారి శేఖర్, సుందర రామరాజు, రాజుగౌడ్, బుచ్చిరెడ్డి, బీరన్న, రాజశేఖర్‌గౌడ్, రాహుల్, అభీం, నవీద్, సూర్యకిరణ్, రోహిత్ బద్రీనేత, ప్రశాంత్, గణేష్, మురళి, మాజీ సర్పంచ్ పురమల్ల శ్రీని వాస్ నివాళులర్పించారు. క్యూబా, కొరియా, ఫిలిప్పిన్స్, నేపాల్, చైనా కమ్యూనిస్టు పార్టీలు సంతాప సందేశాలు పంపింపాయి.


● బండ సురేందర్‌రెడ్డి, కళ్యాడపు ఆగయ్య మరణం బాధాకరమని జాగృతి జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ అన్నారు.

భగత్‌నగర్: బండ సురేందర్‌రెడ్డి మృతదేహం వద్ద సీపీఐ నాయకులు నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, సృజన్‌కుమార్ పాల్గొన్నారు.

భారత గడ్డపై సీపీఐది వందేళ్ల పోరాట చరిత్ర

సైదాపూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భారత గడ్డపై సీపీఐ పార్టీకి వందేళ్ల పోరాట చరిత్ర ఉందని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ సీనియర్ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 15న కొమురం భీం జిల్లా జోడేఘాట్ నుంచి ప్రారంభమైన జాతా మంగళవారం మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సీపీఐ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్య కావాలని తొలుత గుర్తించిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. ఈ నెల 26న ఖమ్మంలో జరిగే 100 ఏళ్ల చరిత్ర ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల కార్యదర్శి కళ్యాణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తిమ్మాపూర్, పొరండ్ల రోడ్డు పనులు ప్రారంభించాలి


రాజీవ్ రహదారిపై బైఠాయించిన నాయకులు

తిమ్మాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ నుంచి పోరండ్ల గ్రామం వరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలోని రాజీవ్ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తిమ్మాపూర్ నుంచి పోరండ్ల గ్రామం వరకు రోడ్డు అధ్వానంగా మారిందని, రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం కోసం రూ.2 కోట్లు మంజూరయ్యాయని, ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతున్నా ప్రారంభించపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, 15 రోజుల్లో పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అఖిల పక్షం నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఉల్లెంగుల ఏకానందం, మాతంగి శంకర్, జగదీశ్వరాచారి, నాయిని వెంకట్ రెడ్డి, కేతిరెడ్డి అంజిరెడ్డి, రామిడి మల్లారెడ్డి, రావుల రమేష్, పాశం అశోక్ రెడ్డి, మాతంగి బాబు, లక్ష్మణ్, అశోక్ పాల్గొన్నారు.